ఇలా యిల్లు కట్టడం గురించి మేము చాలా చాలా సార్లు ఆలోచించాం. యాభైవేల రూపాయలెట్టి సపోజ్ మనం యిల్లు కడితే మన కాపిటల్ బ్లాకయి పోతుంది. 50 వేల మీద నూటికి ఏడురూపాయలు వడ్డీవేసుకున్నా ఏడాదికి మూడువేల ఐదువందలు. సుమారు నెలకు మూడువందల రూపాయలలోపు ఆదాయం వస్తుంది. అదేయిల్లు కట్టేస్తే నెలకు మూడొందలు అద్దెవస్తుందా? రాదు ఎలక్ట్రిక్ బిల్లులు ఇళ్ళ పన్నులు నోటీసులు వస్తాయి. మనం ఆ యింట్లోవుంటే ఆ అద్దెరాదు. పైగా సున్నాలు, బాగోగులు మెయింటెనెన్స్ – ఈ న్యూసెన్సంతా ఆలోచించి మనకి ఇల్లు వద్దండీ అన్నాన్నేను. అద్దె కొంపలోవున్న సుఖం సొంత యింట్లో ఎలా వస్తుంది? అద్దెయింట్లో మనను పన్నులు పీకవు. అదోహాయి – స్వంత యింటిమీద మనకు లాభం రావాలంటే యిల్లంతా అద్దెకిచ్చేసి మనం వేరే అద్దెయింట్లో వుండాలి. ఇల్లు కట్టెయ్యగానే సరదా తీరిపోతుందికదా –

వెంటనే దాన్ని అమ్మివెయ్యాలి. అప్పుడు గాని ప్రాణం హాయిగా వుండదు. మేం ఇల్లు కట్టే ప్రోగ్రాం వాయిదా వేశాం – దానివలన మాకు యాభైవేలమీద నెలకు మూడు వందల రూపాయలు చొప్పున లాభం వస్తోంది. ఇప్పుడు మేం నూట యాభై రూపాయలు అద్దెయిస్తున్నాం – ఇవ్వగా మాకు నూటయాభై మిగుల్తోంది. (అఫ్‌కోర్స్ మా దగ్గర యాభైవేల రూపాయల్లేవనుకోండి. వుంటే నూటయాభై చొప్పున మిగిలేవి) మేము లక్షరూపాయలతో యిల్లు కట్టకుండా వుంటే మాకు నెలకు ఆరు వందలు ఆదా అవుతుంది. మీరైనా అంతే లక్ష రూపాయలుంటే యిల్లు కట్టకండి, మేం అందుకే యిల్లు కట్టడం మానుకున్నాం. మా కిప్పుడు ఇంటి పన్ను పెంచుతారనే బెంగాలేదు. నోటీసు లొస్తాయనే భయమూ లేదు. ఇంట్లో అద్దెకొచ్చేవాళ్ళు ఎలాటి పెంకెఘటాలో అన్న అనుమానమూ లేదు. సొంత యింట్లో మేకు కొడుతూంటే మన గుండెల్లో దిగినట్లుగా వుంటుంది. అద్దె యింట్లో గోడకి మేకు కొడుతూంటే పక్కవాడి గుండెల్లో మేకు దిగుతున్నట్లుగా వుంటుంది. పక్కవాడి గుండెల్లో మేకు దిగితే మనకేం?

# చిట్టిగారెలు

**పు**ణుకుల్లో పెసర పునుకుల్లాగా, గారెల్లో చిట్టిగారెలు పులుల్లో చిరుత పులుల్లాంటివి. నాస్తికుడైనా, నక్సలైటైనా, కారల్‌మార్క్స్ అయినా ఎర్నెస్ట్ హెమ్మింగ్ వే అయినా, జాక్విలిన్ ఒనాసిస్సయినా ఓపలేక చిట్టి గారెలు తినాలనుకుంటే ఆంజనేయులు స్వామికి మొక్కుకోవాల్సిందే! మన గాడ్స్ చాలా భోజన ప్రియులు, తిండి విషయంలో మన యిష్టాలే వారి యిష్టాలు. తేడాలుండవు, మనం పంపు దగ్గర జలకాలాడితే వారు పంచామృతాలు స్నానం చేస్తారు. నైవేద్యాలు మహా నైవేద్యాలు వున్నప్పటికీ భక్తుల పూజాదికాలు పూర్తయ్యే

సరికి దేవుడు గారికి శోషరావచ్చు అందుకని బెల్లం ముక్క నుంచి అరటి పండు వరకు భక్తులు అవసరనైవేద్యం కావిస్తూ వుంటారు.

కొబ్బరికాయలు కొడితే కొందరు దేవుళ్ళు సంతోషిస్తారు. కొందరు సంతోషించరు. దేవుడికి నైవేద్యం పెట్టాక అది ప్రసాదం అవుతుంది. కొందరు భక్తులు వుపోషాలుంటారు. కొందరు ప్రసాదాలు ఆరగిస్తారు. భక్తి, ముక్తీ అన్నారు కాని, ఈ రెండూ భోజనంలో వున్నట్లు నాకనిపిస్తూ వుంటుంది. దేవుడనేవాడుంటే వాడు వుల్లి పెసరట్లకోసం మిరపకాయ బజ్జీల కోసం భక్తుల్ని యాచించడు కదా! అంచాత ఇంగర్సాల్ చెప్పినట్లు మన అజ్ఞానమే దేవుడిగా అవతరించిందని మనం ఒప్పుకు తీరాలి. చిరుతిళ్ళ కోసం భక్తుల్ని అల్లరిపెట్టే దేవుళ్ళు కొంత మందికి ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారేమో ననే అనుమానం కలుగుతూవుంటుంది. ఇప్పుడు ఫరెగ్జాంపుల్, ఏడుకొండలవాడున్నాడనుకోండి. అతనికి కొబ్బరి కాయకొడతానంటే వప్పుకోడు అతనికి వడలిష్టం. లడ్డూ, పులిహోర, చక్రపొంగలి వగైరాలన్నీ యిష్టమేననుకోండి. అవినేతితో చెయ్యాలి. మామూలు బెల్లం ముక్క నైవేద్యం పెట్టరాదు. పటిక బెల్లం పెట్టాలి. కొబ్బరికాయ కొడితే తల నొప్పి వస్తుందట ఆయనకి, పట్టీవేసుకు పడుకుంటాడుట. దేవుళ్ళని మనం చాలా హ్యూమనైజ్ చేశాం. దేవుడు నగలు పెట్టుకుంటాడు. గోవుల్ని కాస్తాడు. అమ్ములు బాణాలు ధరిస్తాడు. వేణుగానం వినిపిస్తాడు, భక్తురాండ్రతో క్రీడలు జరుపుతాడు. రాత్రిళ్ళు యమునా తీరమునందున సొగసు కత్తెలతో నికుంజములలో దూరి కేళీ వినోదాలు జరుపుతాడు ఈ రోజుల్లో యిలాటి పనులు చేసే వారినెవరినైనా జనం పబ్లీకున అసహ్యించుకుంటారు. మన దేవుళ్ళ కంటే మనకు మంచి మోరల్‌సెన్స్ వున్నట్లు కనిపిస్తుంది. అనసూయ అత్రిమహాముని భార్యకదా ఆవిడ పాతివ్రత్యాన్ని పరీక్షించాలని, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు వెళ్ళి నువ్వు వివస్త్రవై మాకు అన్నాలు పెట్టమని అడగడం ఏవిటి? అన్నం తినేవారెవరైనా ఎవరింటికైనా వెళ్ళి ఆ ఇల్లాలిని యిలా అడుగుతారా? చూడగా చూడగా దేవుళ్ళవి యిలాలూజ్ మోరల్స్‌గా కనిపిస్తున్నాయి. స్త్రీ కృష్ణుడు స్త్రీ నాధుడే అని అంతా ఒప్పుగుంటారు. ఈ ఇరవయ్యో శతాబ్దంలో కూడా ప్రతి మాణిక్యాంబా, ప్రతి వీర వెంకటరత్న సూర్యకుమారి తనే గోపిక ననుకుని డాబామీద కృష్ణుడు ఎప్పుడు విజిల్ వేస్తూంటాడా అని చూస్తూవుంటుంది. మధుర భక్తి సంప్రదాయమని కోస్తారు మన వాళ్ళు. అదంతా విడో విత్‌గోల్డ్ లెటర్స్ అన్నట్లు బూతు పురాణమే. సంస్కృతంలో వ్రాసి తెలుగు చేసి పారేశారు. ఇత్తడి చెంబుకి తగరం పూత పెట్టినట్లు రోమాన్స్‌లకి భక్తి మలామా చేశారు.

కమింగ్ టూ ది పాయింట్ – చిట్టి గారెలొండమన్నారు. వాళ్ళ ఫ్రండ్‌కి మ్యారేజయిందట – అది లవ్ మ్యారేజట. ఆ అమ్మాయితో పెళ్ళి అయితే ఆంజనేయులు స్వామికి 108 చిట్టి గారెలతో దండ వేస్తానని ఆ ఫ్రండు మొక్కుకున్నాడట. ఆ అమ్మాయి కాపరాని కొచ్చింది – కాని చిట్టిగారె లొండటం రాదు. మావారొచ్చి నూట ఎనిమిది చిట్టిగారెలొండి దండగుచ్చి రడీగా వుంచమన్నారు. పిండి పిసకటానికయినా ఆ అమ్మాయికిరాదా అని బిక్కమొగం వేసుకుని

అడిగాను. చెప్పింది చెయ్యమంటుంటే, పెళ్ళి కూతురెలాగా వస్తుందే పాపం అని సర్ది చెప్పబోయారు.

ఆ అమ్మాయొచ్చింది పిన్నిగారూ అంటూ. నేను పిన్నిగార్నా యింకానయం బామ్మగారు అందికాదు. టాక్సీలో వెళ్ళి కన్నాట్ ప్లేసులో ఆంజనేయస్వామికి చిట్టిగారెల దండ వేసి వచ్చాం (దండ మాతో తెచ్చుకున్నావనుకోండి) కొత్త దంపతులకు మా ఇంట్లో టీ టిఫిన్ – ఆ అమ్మాయి....చాలా కలుపుగోలు పిల్ల.... పిండి పిసక్క పోయినా మనం ఒహప్పుడు కొంత మందిని క్షమించేసెయ్యాలి. ఆ రోజు మేం రాత్రల్లా చిట్టిగారెలు తింటూ ఆడవాళ్ళు ఆడహస్కు, మగవాళ్ళు మగహస్కు వేసుకుంటూ నిద్దరోకుండా కబుర్లతో కాలక్షేపం చేశాం. అందుకే చిట్టిగారెలుతినాలంటే లెనిన్ మనవరాలి మొగుడైనా ఢిల్లీలో కన్నాటుప్లేసులో ఆంజెనేయులు స్వామికి మొక్కుకోవలసిందే.

# సత్తుగిన్నెస్టోరీ

మజ్జిగ పోసుకోటానికి పాలు తోడెట్టుకోటానికి మా ఇంట్లో తాత ముత్తాతల నాటి సత్తుగిన్నె ఓటుండేది. ఆసత్తుగిన్నెని మేవంతా తోమి తళతళలాడేట్టు మెరిసిపోయేలా వుంచేవాళ్ళం. అప్పటికి జర్మన్ సిల్వరు పళ్లేలూ, కంచాలూ, సిబ్బెలూ,గిన్నెలూ వచ్చినా వాటిని మా ఇంట్లోకి రానిచ్చేవారు కారు మా అత్తగారు. కంచు, ఇత్తడి సామాన్లే వాడేవాళ్ళం కాని మాయవెండి అన్నా, పింగాణి సరుకన్నా మా వాళ్ళకి డోకు. వెండి కంచాలు, వెండిగ్లాసులు, వెండి మరచెంబులూ, తమలపాకుల పళ్లేలు గంధపు గిన్నెలు పన్నీరుబుడ్లూ, పూదొత్తుల స్టాండ్లూ, కుంకుమ భరిణలూ, యిలాచాలా మిస్లేనియస్ సరుకు వెండివే మాకూ వున్నాయనుకోండి. వాటిని పెట్లలోనూ బీరువాల్లోనూ దాచుకునే వాళ్ళం. అప్పుడప్పుడు బద్ధకించినప్పుడు రాత్రిళ్ళు మా వెండి సామాన్ను తొల్చి శుభ్రంచేశాక మాసిన బట్టల బుట్టల్లోనూ బియ్యపు డబ్బాలోనూ పెట్టి పైన విడిచిన బట్టలూ, కూరల బుట్ట, చేటా వగైరాలను కప్పి శుభ్రంగా నిద్దర్లుపోయే వాళ్ళం. కంచుచెంబులు పంచపాత్రలు రాగి హరివాణాలు ఉద్ధరిణలు ఇత్తడి చెంబులు, గ్లాసులు, గట్రా ఉండేవనుకోండి అవన్నీ తళతళామెరిసి పోయేలా తుడిచి సర్దుకుని మా వంటిల్లు కలియుగ వైకుంఠంలా తీర్చిదిద్దుకునేవాళ్ళం. కడిగిందే కడగటం తుడిచిందే తుడవటం అస్తమానం బాల్చీ చీపురు కట్టా అలుకుగుడ్డా చింతపండు కుంకుడుకాయ పిప్పితో, సున్నిపిండితో కొబ్బరి పీచుతో మా రోజులు వెళ్ళిపోతుండేవి.

అప్పటికి కుంపట్లు వచ్చాయికాని పొయ్యిలు ఇంకా మూలపడలేదు. కాఫీలు, గూఫీలు, పప్పులు పాలుకాచటం, చంటిపిల్లలకు వేడ్నీళ్ళు కాచటానికి బొగ్గుల కుంపటీ వాడేవాళ్ళం